# అప్పిశెట్టి కవిత్వపు అఘోరింపు

క్రొత్తరీతి కవిత్వంకోసం అపూర్వపదాలవాడుక.
అమరం నెమరువచ్చిన కవిత్వం.
తెనాలి రామలింగడుచేసిన పరాభవం.

రచయిత:
## పురాణం పిచ్చయ్యశాస్త్రి

విజయనగర రాజ్యాన్ని కృష్ణరాయలు పాలించేకాలంలో ఆ పట్టణమందు అప్పిశెట్టి అనేపేరుగల వర్తకుడు ఉండినాడు. అతడు ఎక్కువగా చదువుకొన్నవాడు కాడు. ఏదో బడిచదువు కొంచెం చదివినవాడు అమరం అర్థం తెలియకపోయినా మూడు కాండలున్ను అపస్వరాలతో గుక్కతిప్పకుండా ఒప్పచెప్పేవాడు. "అమరం తెలియనివానినోట్లో నేనుఅమర''నని సరస్వతి చెప్పినట్లు వాక్యం వాడుకలో కలదనిన్నీ, తాను పూర్ణంగా అమరాన్ని చదివి ఉన్నందున ఆమహాతల్లి సరస్వతమ్మ తన నాలుకమీదనే నివసించి ఉన్నదనిన్నీ, తానున్ను నలుగురిలాగు పండితులలెక్కలో చేర్చదగినవాడే అనిన్నీ శెట్టితలంపు.

అట్టి తలంపుమాత్రమేగాక తాను గొప్ప పండితుణ్ణి అనికూడా ఒక విధమైనగర్వము అప్పిశెట్టికి.

శ్రీకృష్ణదేవరాయలవారు విద్యాప్రియులై కవులను, విద్వాంసులను ఎక్కుడుగా గౌరవించడం- సన్మానించడం- క్రొత్త క్రొత్తగా కవులు వ్రాసితెచ్చే గ్రంథాలు, పద్యాలు, పాటలు విని సంతోషిస్తూవుండడం వాడుకగా ఉండేది.

ఆసంగతి అప్పిశెట్టికి బాగా తెలుసు. చూస్తూవుండేవాడు కూడాను. అప్పట్లో శెట్టికొకబుద్ధి పుట్టింది.

ఏమని? కృష్ణదేవరాయలవారు శృంగారరసంలో ప్రీతిగలవాడనిన్నీ, తానున్ను అటువంటిదేదో పాటో, పద్యమో చెప్పి చదివి వినుపించి రాయలవారి మెప్పుపొందాలనీ అనుకొన్నాడు. అయితే కవిత్వంచెప్పేశక్తి అతడికిలేదు. ఏలాగు కలుగుతుంది? అది పుట్టుకతోనే కలగాలె కాని కోరుకొంటే వస్తుందా? అయినా శెట్టి తనపట్టు విడవలేదు. ప్రయత్నంచేస్తే యెంతటి గొప్పపనినైనా సాధించవచ్చునని అతని నమ్మకం. ఎట్లాగైనా కవిత్వం చేసితీరాలసిందేనని నిర్ధారణ చేసికొన్నాడు అప్పిశెట్టి. జన్మంతోనే కవనంచెప్పేబుద్ధి కలగకున్నా, పాండిత్యంవల్లకూడా ఏదైనా వ్రాయవచ్చునని యెవరో చెప్పగా విని వున్నందున, తాను మూడుకాండలు అమరం నిరాటంకంగా చెప్పగల పండితుడగుటవల్ల, యేదైనా ఒకటి రాయడం తనకు కష్టమైన పనిగాదనిన్నీ, శబ్దాలన్నీ తననోట్లోనుంచే కలుగుతాయనిన్ని నిశ్చయం చేసికొన్నాడు.

ఒకనాడు ఉదయాన్నే కవిత్వానికి లగ్నంచూచుకొని, తాటాకు గంటము తీసుకొని తానువ్రాసేది పూర్తి అయ్యేవరకు యెవరికి తెలియరాదనిన్నీ, ఏకాంతంగా కూర్చుండి వ్రాయాలనని ఎంచుకొని పట్టణంలోనుండి బయటప్రదేశానికి పోయాడు.

ఒకచోట పెద్ద వఱ్ఱిచెట్టుంది. చూచాడు ఎవరూ లేకుండడంచేత, దానిమొదట కూర్చొనిరాయడానికి అనుకూలంగా వుంటుందనుకొన్నాడు అక్కడికి పోయి నాలుగు తట్లా చూచాడు. ఎవరు జనులు దాపుగా లేరు. చెట్టుపుట్టవేళ్ళపై కూచున్నాడు. గంటంతల పెదివి

మీద నాన్చుకొని ఒకచేత తాటాకుపట్టుకొని, ఏమిరాయాలనో, యెట్లారాయాలనో. ఆలోచించడానికి మొదలుపెట్టాడు క్రొత్తకవీశ్వరుడు.

అపు డతడికి యేమితోచిందంటే, సాధారణంగా కవులందరూ వ్రాసేమాటలు తన కవిత్వంలో ఉపయోగించరాదనీ, క్రొత్తపోకడలతో నడిపించి రాయలవారి కాశ్చర్యం కలిగించాలసిందనీ ఉద్దేశం కలిగింది. తాను అమరం చదివిన పండితుడగుటవల్ల శబ్దాల కేలోటు వుండదనే ధైర్యమేర్పడింది.

అయితే ఏదిరాయడం—అనే యోచన—నాయకుడికి, నాయకకి యెడబాటు—నాయకుడు పరితపించడం—అవిషయం పాటలో యిమడ్చాలె అని నిశ్చయంచేసుకొన్నాడు.

మొదలుపెట్టాడు రాయడానికి. 'శుకఃకోకిలయిత్యాపి' అనే వాక్యం తోచింది. కాని, 'శుకాలు—కోకిలాలు, అందరు కవులు చెప్తూ వుండేవే. ఇనే పదాలువాడితే తన క్రొత్తదనం యేముంది? ఛీ! ఇట్లు కాదు, కడపటిశబ్దం చాలు. బుద్ధిమంతు డర్థంచేసుకుంటాడు. పండితకవనమంటె యిట్లేవుండాలె' అనుకొని మొదటిచరణం ఇత్యాపితో ఆరంభించాడు కవీశ్వరుడు.

'ఇత్యాపులు చెట్టెక్కి కూసెగా' అని రాసి సొగసుగా కుదిరిందనుకొన్నాడు.

'దర్పకోనంగః' అనే దానిలో దర్పతీసి 'కోనంగు డంబులనేసెగా' అనిరాసి సరిగా ఉన్నదనుకొన్నాడు తరువాత 'మృగాంకః కళానిధిః'లో, మృగ అనేది తొలగించి, గాంకుడు వెన్నెలగాసెగా అని 'హిరణ్యాగర్భుడనుటలో హిరణ్యాను తోసి, 'గర్భుడు వెతలొందజేసెగా, అనీ- 'సమీరః మారుతమరు' త్తనడంలో మొదటిశబ్దాలుతోసి 'తమరుడు చల్లగా డాసెగా' అనీ- మత్తకాశినిలో మొదటి అక్షరాలు రెండుతీసి 'కాశిని నన్నొడబాసెగా' అనీ- 'అకూపారంలో రెండువర్ణాలువిడిచి 'పారంలోనను ముంచివేసెగా' అనీ- యేడు చరణాలు రాశాడు. ఎనిమిదోపాదం తోచలేదు పాపము—ఏంచేస్తాడు! ఆలోచించాడు. మరీ ఆలోచించాడు—కుదరలేదు తాను రాశిన పాటను మొదట్నుంచి చూచి

ఇత్యాపులు చెట్టెక్కి కూసెగా—
కోనంగు డంబులు యేసెగా
గాంకుడు వెన్నెలగాసెగా—
గర్భుడు వెతలొంద జేసెగా
తమురుడు చల్లగా డాసెగా—
కాశిని నన్నొడబాసెగా
పారంలో ననుముంచివేసెగా—

అని నాలుగైదుమార్లు చదివాడు గట్టిగా, అక్కడ ఇతరులు లేరు గదా అనే ధైర్యంతో—

అప్పుడు 'అప్పిశెట్టి నీముండమోసెగా' అనే వాక్యం అతనికి వినబడ్డది చెట్టుపైనుండి— దయ్యమనుకొన్నాడు— దిగులుపడి తలయెత్తి చూచాడు చెట్టుమీదికి- అక్కడ కొమ్మ పంగలో ఒకమనుష్యుడు కూర్చొనివున్నాడు- శెట్టి చర్యలుచూస్తూ నవ్వుకుంటూ— అప్పిశెట్టి గుండెలు జల్లుమన్నాయి- భయం- సిగ్గున్నూ- ఓరి దేవుడా! చచ్చానురా! నాపరువు తీస్తాడింక యీకొంటె ముండాకొడుకు అనుకొని చేతిలోని తాటాకు గంటము క్రిందపడేసి తిరిగిచూడకుండా పరుగెత్తి పోయాడు అప్పిశెట్టి.

చెట్టుపైనుండిన మనుష్యుడు యెవడో వింతవాడుగాడు. అతడు మన తెనాలి రామకృష్ణుడు. శెట్టి రావడమునకు ముందుగానే ఆకులు కోసికొని పోవడముకొరకువచ్చి అతడు చెట్టుపై ఎక్కి ఉండినాడు. అప్పిశెట్టి పైతట్టు చూడకుండా ఎవ్వరు లేరనుకొని అక్కడ కూర్చున్నాడు.

అతడెందుకువచ్చాడో యేమి చేస్తాడో తెలుసుకోవాలెనని రామకృష్ణుడు సందడికాకుండా కూర్చొని అంతాచూస్తూ కవిత్వం వింటూవుండి, కడపట శెట్టి ముగింపు తోచకుండా తంటాలుపడడం తెలుసుకొని నవ్వాపట్టలేక— 'అప్పిశెట్టి నీముండమోసెగా' అని ఎనిమిదోపాదం పూర్తిచేశాడు. శెట్టి లజ్జతో పారిపోయాడు.

రామకృష్ణకవి శెట్టిని అంతతో విడువలేదు. శెట్టి పడేసిపోయిన తాటాకు, గంటం తీసుకొని పట్నంలోకి పోయి పదుగురికి అప్పిశెట్టి కవిత్వం చదివి వినిపించి కడుపులుబ్బేటట్లు నవ్వించాడు.